


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## ఖాళీ చేసిపో

**చిన్నప్పుడు నాయనమ్మ** చిన్న నవారు మంచం మీద ముడుచుకుని కూర్చునేది. కింద కుంపటిలో ఎర్రగా బొగ్గుల నెగడు వుండేది. అందరం ఆ మంచం మీదకి చేరేవాళ్ళం. "నాయనీ కథ చెప్పవా?" అంటూ కౌగలించుకుని కూర్చునేవాళ్ళం. వెచ్చగా కుంపటినే కౌగిలించుకుని కూర్చున్నట్లు వుండేది. ఆవిడ ఏ భక్తశిరియాళుడి కథో, సతీ సుకన్య కథో చెప్పేది.

"ఏం బాలేదు నాయినీ వేరేది చెప్పూ" అనేదాన్ని.

చిన్నప్పటినుండీ దేవుడంటే భయం, లేదా మొగుడు కోసం ఎంతటి త్యాగం అయినా చెయ్యడం నాకు నచ్చేది కాదు. కానీ నాయనమ్మని కౌగిలించుకుని కూర్చోడం నచ్చేది. నా పైన అక్కయ్యలూ, అన్నయ్యలూ కూడా వెచ్చదనం కోసం అదే మంచం మీదకి చేరేవాళ్ళు.

ఇంతలో అమ్మ ముంత ఖర్జూరమో, ద్రాక్ష పండ్ల పొట్లమో తెచ్చి నాయనమ్మకి ఇచ్చేది. ఆవిడ పొట్లం విప్పి, మా అందరికీ తలా నాలుగూ ఇచ్చేసరికి పొట్లం ఖాళీ. మేమే తలో పండూ ఆవిడ బోసి నోటికి అందించేవాళ్ళం.

ఆ మంచం మీద చుట్టూ మునిమనవలతో విక్టోరియా మహారాణిలా వుండేది దర్పంగా ఆవిడ.

మా లక్ష్మక్క ఆవిడని ఆట పట్టించడానికి "నాయనీ రింగ్ అంటూ సినిమాలోలా తల పక్కకి వాల్చి పడిపోయినట్లు చేసేది. పడుకున్నావిడ లేచి వచ్చి, తొడపాశం పెట్టి "భడవా! నన్నే ఆట పట్టిస్తావా? అంటూ 'ఖళ్ ఖళ్' మని దగ్గుతూ వెళ్ళి పడుకునేది. లక్ష్మక్క నవ్వేది. అది అలాగే చేస్తుందని తెలిసినా ప్రతిసారీ ఆవిడ లేచి వచ్చేది పాపం.

ముసలితనం అంటే, నిండా దుప్పటి కప్పుకుని, ఎండలో కూర్చుని ఆపదామపాహర్తారం" అంటూ స్తోత్రాలు చదువుకోవడం సాయంత్రం వేళ మాలాగా అన్నం తినకుండా ఏ ఫలహారమో, ఉప్పుపిండో చేసుకు తినడం మాత్రమే అనుకునేదాన్ని.

కళ్ళు మసకలు కమ్మి ఎవరూ దగ్గరగా వచ్చేదాకా గుర్తు పట్టకపోవడం, చెవుల వినికిడి మందగించి, కేవలం అన్నింటికీ తల వూపి వూరుకోవడం, రాను రాను స్నానానికీ, వాటికి కూడా ఒకరిమీద ఆధారపడడం, ఎవరైనా తలదువ్వి ముడేసినా, కాళ్ళకి నూనె రాసినా కృతజ్ఞతగా చూడడం, పళ్ళు లేక మెత్తగా వుడికించినవీ, నూరినవీ పెడితే ఆనందపడి చప్పరించడం ... ఇవన్నీ వృద్ధాప్యం అని తెలిసేవి.

కానీ వృద్ధాప్యం అంటే... చిన్నప్పటినుండీ మనం బజార్లో, సంతలో, పై ఊళ్ళకి వెళ్ళినప్పుడూ ఎంతో ముచ్చట పడ్తూ, ఆనంద పడ్తూ, ఎన్నో సామాన్లు కొనుక్కుంటామా? ఆపేక్షగా 'ఇది నా ఇల్లు' అని ఓ ఇంట్లో అమర్చుకుంటాం. అలవికాని అనుబంధాలు ఏర్పరచుకుంటాం, మొక్కలతో, పిల్లలతో, బంధువులతో, స్నేహితులతో, అటకలు నిండిపోయేటంత పాత సామాన్లు వున్నా మళ్ళీ కొత్త సామాన్లు కొంటాం. పాత బంధువులనందరినీ మరపింప చేసే కొత్త చుట్టాలొస్తారు. వాళ్ళే పిల్లలకు పెళ్ళిళ్ళు అయితే, పుట్టే మనవలు. ఆ తర్వాత మునిమనవలు. ఈ కొత్త బంధాలు మరీ మనసుకు చేరువవుతాయి. ఈ చేతుల మీద మూడుతరాల పిల్లలకి ఉగ్గు పట్టి, నీళ్ళు పోసి పెంచినా, ఈ కొత్త చుట్టాలు చిర్రున చీదినా, ఖళ్ళున దగ్గినా, జ్వరం వచ్చి కన్ను మూసుకుపడుకున్నా, ప్రాణం కొట్టుకుపోతుంది.

రామయ్య తండ్రికి కొబ్బరికాయా, ఆంజనేయుడికి ఉపవాసం, వడ్డికాసుల వాడికి, పదిరూపాయల మనియార్డరూ! ఇలా ఆ బిడ్డ లేచి తిరిగేదాకా మొక్కులూ, ఉపవాసాలూ నడుస్తాయి. అటకల మీదుండే, పెళ్ళి నాటి గంగాళాలూ, కొమ్ము చెంబులూ, రాగి పాత్రలూలాంటి పాత చుట్టాలకన్నా, ఈ కొత్త పాత్రలు మెరుస్తూ జీవిత నాటక రంగం మీద మైమరపిస్తాయి. ఎంతో అనుబంధం పెనవేసుకున్నాక, ఇది నా మడి నా ఇల్లూ అన్నీ సర్దుకుని, పూలనారూ, కూరగాయ మడులూ, దేవుడి మందిరం, తులసికోటా, పాత్ర గ్రామఫోనూ, భగవద్గీత స్టాండూ, పాత పడక కుర్చీ, కాలు విరిగిన ముక్కాలు పీటా, చెవులు వూడిన పాత బకెట్టూ, కిర్ కిర్ శబ్దం చేసే ఫానూ, స్టేషన్‌లన్నీ కలిసిపోయి బొంగురు గొంతుతో "పోనీ హనుమా, నేటికి నిలుమా... బడలిక తీరా. రేపు పొమ్మా" అని ఎమ్.ఎస్. రామారావుగారి గొంతు పలికే రేడియో, అట్ట చిరిగిపోయి, కాయితాలు జేగురు రంగుకి తిరిగిన చిన్నప్పుడు చదివిన తొలి యవ్వనపు అనుభూతుల్ని బహుమతిచ్చిన నవలా, పిలకల జడతో స్కూల్లో తీయించుకున్న ఫోటో, చక్రాలు లేని పాత ర్యాలీ సైకిలూ, తిరగని గోడ గడియారం ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన హరికెన్ లాంతరూ, గోడకి మీటతో దిగేసిన కాఫీ పొడి ఆడే మిషనూ, వంకీకి గుచ్చిన ఉత్తరాల గుత్తీ, పాత పడిన చిలక్కొయ్యా, ఎవరూ అక్కర్లేదనుకున్న పాత భోషాణం వాటిలో దాచుకున్న పుస్తకాలూ పుస్తకాలలో నెమలీకలూ, జీవితపు ప్రతి ఘట్టానికీ సాక్షీభూతమైన ఫోటోలు గమ్ తో అతికించుకున్న ఆల్బమ్.

రామేశ్వరంలో రాగి చెంబూ, బృందావనంలో కొన్న 'బాకీ బిహారీ బాబు' విగ్రహం, ఆగ్రాలో కొన్న తాజ్ మహల్, ఆఖరి పిల్లాడు వాయించిన విరిగిన మురళీ, పెద్ద పిల్ల ఆడిన ఏక్తారా, చిన్నదాని వెండి ఉగ్గు గిన్నె, పెద్దాడి బొడ్డు వూడినప్పుడు తాయెత్తు వేసి చేయించిన వెండి మొలతాడూ, పెళ్ళవగానే ఆయన కొన్న బిన్నీ జార్జెట్ చీరా... అత్తగారు ఇచ్చిన రాచిప్పలూ, అమ్మ పసుపు కుంకుమలు ఇచ్చిన నెమలి కుంకుమ భరిణా, పండక్కి వెళ్తే చిన్నన్నయ్య గాజుల మలారం మల్లయ్యని పిలిపించి వేయించిన చెమ్కీ గాజులూ, పదోతరగతి పాసయినప్పుడు నాన్నగారిచ్చిన ఫౌంటెన్ పెన్నూ... మొదటిసారి వాకిట్లో పోస్ట్‌మేన్ గిరాటు వేసి వెళ్ళిన, పసుపు పచ్చ రంగులో ప్రేమలేఖా, సినిమా హాల్ ముందు కొనుక్కున్న 'దసరాబుల్లోడు' పాటల పుస్తకం అన్నీ ఆ భోషాణంలో పెట్టి తాళం పెట్టి, ఆ జ్ఞాపకాలని ఎవరూ చూడకుండా, తెరిచి చూసుకుని, మళ్ళీ మరుగున పడేస్తూ, ఇన్నేళ్ళు గడిపాక, ఇప్పుడు...

'స్నో' పౌడర్ రాసిన నున్నటి చెక్కిళ్ళు ముడతలు పడి, వేళ్ళాడుతుంటే, తలంటుకుంటే 'వీశడు కుంకుడు కాయలు కావాలి' అని మూతి తిప్పిన అత్తగారు, అసూయ పడ్డ బారెడు కురులు, వేలి ముడికి అందక, మొక్కజొన్న పొత్తుపై పీచులా బంగారు రంగులో నాలుగు పరకలు మిగిలాకా, ఒంటికి చూసిన చీరల్లా కట్టాక, ఇప్పుడు బట్ట మోయలేని భారమైపోయి, ఒంగిన నడుం, ఆనని చూపుతో ఏదో వినపడని పిలుపుకోసం ఆశగా కంటికి చెయ్యి అడ్డం పెట్టుకుని, పగలూ రాత్రీ ఎదురు చూసే వేళ హఠాత్తుగా కాబూలీవాలా అప్పుకట్టమన్నట్లు, ఇంటి యజమాని, ఇల్లు ఖాళీ చెయ్యమని, ఉత్తర్వులు ఇచ్చినట్లు ఈ గూడు, గుబుళ్ళు గుండెడు జ్ఞాపకాలు.. అన్నీ వదిలేసి ఖాళీ చెయ్యమంటే ఎలా?

సహస్ర పున్నములు చూసిన మేల్‌తలపుల, గుండె బీరువాని వదిలి, గూడు ఖాళీ చేసి పొమ్మంటే, కలిగే ఆవేదన, బాధ, నిస్పృహ, నిర్వేదం, ఇవన్నీ వృద్ధాప్యం.

కళ్ళజోడు ఎక్కడో పెట్టిన గుర్తు. మందుబిళ్ళ వేసుకున్నామో లేదో గుర్తు రాదు. ఎవరో మాట్లాడ్తున్నారు. ఆనవాలు పట్టలేక పోతాం. ఎన్నో కీర్తనలు పాడిన కంఠంలోంచి శబ్దం అతి కష్టం మీద వస్తుంది. రాత్రిళ్ళు నిద్రపట్టదు. పగలు ఎంతకీ తరగదు. పని చేసుకునే వారికి కాలికీ చేతికీ అడ్డు. చిన్న పిల్లలు ఆడుకునే బొమ్మలలో ఒకటిగా మారి.

ఏవీ పోగొట్టుకున్న ఆ జ్ఞాపకాలు?

చెయ్యి పట్టుకుని నడిచిన స్నేహితులు?

ఒంటిమీద ముడతలుగా మారిన తీపీ, బాధా అనుభవాలు?

బావుల్లాంటి ఎండిన కళ్ళు.

పండిన తలపుల్లాంటి కురులు.

మీటి మీటి రాగాలింకిన వీణలాంటి ఒంగిన నడుం...


దారంతా గోతులతో గొప్పులతో  వుండడం వల్ల కొంగున కట్టుకున్న మూటలోంచి ఒక్కొక్కటిగా రాలిపోయిన బంధాలు..

వసంతంలో చిగుళ్ళూ కోయిల పాటా, రాలిన ఆకూ, రాసిన కవితా,.. అన్నీ వదిలేసి నీ క్రొత్త ఇంటికి వస్తున్నాను ప్రభూ. పాలేవీ? ఇంకిపోకముందే పొంగించాలి.

ఆ స్థితే వృద్ధాప్యం అంటే.

Post your comments







https://www.youtube.com/watch?v=ERaaX_IulS4